నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అదించాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం జగన్నాథపురంలోని చర్చి స్క్వేర్ జెడ్పి పాఠశాలలో వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నగర ఉపాధ్యక్షులు కరుణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత కనీస ప్రమాణాలకు దూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన పథకం పేరు మార్చారు కానీ నాణ్యతలో మాత్రం ఎటువంటి మార్పూ లేదని విమర్శించారు. పవన్ కుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సాగరం కోత.. కూటమికి వాత..

- తీర రక్షణపై క్రెడిట్ కోసం ఆరాటం
- వర్మ, జనసేన మధ్య మరోసారి విబేధాలు
- సోషల్ మీడియా వేదికగా ఎదురు దాడి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిఠాపురం నియోజకవర్గంలో టిడిపి, జనసేన పార్టీల మధ్య వైరం కొనసాగుతోంది. టిడిపి నేత ఎస్‌విఎస్ఎన్.వర్మపై జనసేన శ్రేణులు సందర్భం వచ్చినప్పుడల్లా సోషల్ మీడియా వేదికగా ఎదురు దాడికి దిగుతున్నారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో కూటమిలోనే వర్గ పోరు పలు సందర్భాలలో తార స్థాయికి చేరుతుండడంతో చర్చనీయాంశంగా మారుతోంది. తాజాగా ఇటీవల గొల్లప్రోలు మండల కేంద్రంలో ఒక ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో వర్మ ఫోటో లేకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. కూటమిలో ఉంటూ పొత్తు ధర్మాన్ని ఎందుకు పాటించడం లేదంటూ ఈ సందర్భంగా వారు జనసేన ముఖ్య నేతను నిలదీశారు. దీంతో రెండు వర్గాల మధ్య వర్గ పోరు మరోసారి బట్టబయలైంది.

మేమంటే మేము

నియోజకవర్గ పరిధిలో ఉన్న ఉప్పాడ సముద్ర తీర రక్షణ విషయంలో ఇటీవల ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఈ విషయంలో కూటమిలోని అటు టిడిపి, ఇటు జనసేన మధ్య విభేదాలు రాజుకున్నాయి. ఉప్పాడ తీరం రక్షణ, సముద్రపు కోత శాశ్వత పరిష్కారం కోసం రూ.323 కోట్లతో ప్రతిపాదనలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పంపించామని ఈ నెల 18న డిసిఎం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. దీంతో జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున సోషల్ మీడియా వేదికగా విస్తతంగా ప్రచారం చేసుకున్నారు. గతంలోనూ తీర రక్షణకు అనేక ప్రతిపాదనలు వెళ్లాయి. కేంద్రం దీనికి సంబంధించిన నిధులను కేటాయించడం లేదు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసి తీరప్రాంత

ఇటీవల ఉప్పాడ సముద్ర తీరం కోత ప్రాంతాన్ని పరిశీలించిన మాజీ ఎంఎల్ఎ వర్మ

రక్షణ కోసం నిధులను కేటాయించాలని విజ్ఞప్తులు చేశారు. కానీ అవేమీ వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు మరోసారి కూటమి ప్రభుత్వం కేంద్రానికి మరోసారి ప్రతిపాదనలు పంపగా పనులు ప్రారంభం అయిపోయాయి అన్నట్టు జనసేన శ్రేణులు ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ప్రతిపాదనలు పంపామని ప్రకటనలు వస్తేనే పనులు అయిపోయినట్టు చేసుకుంటున్న ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యరూపం దాల్చిన తర్వాత తామే సంబరాలు చేసుకుంటామంటూ తీర ప్రాంత మత్స్యకారులు చెబుతున్నారు. ఇటీవల టిడిపి మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ తీర ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఉప్పాడ తీరాన్ని రక్షించి తీరుతామని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని స్థానికులకు చెప్పుకొచ్చారు. ఇదే విషయాన్ని ఆయన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేశారు. ఉప్పాడ తీర రక్షణకు తమ నాయకుడే కృషి చేస్తున్నాడు అన్నట్టు కనీసం పవన్ కళ్యాణ్ పేరు ప్రస్తావించ లేదనేది జనసేన పార్టీ శ్రేణుల వాదన. తన సొంత క్రెడిట్ కోసం పవన్ పేరు వినిపించకూడదన్నట్టు వర్మ వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తమ నాయకుడు ప్రతిపాదనలు పంపితే మీరు ఎలా ప్రచారం చేసుకుంటారు అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ధోరణి సరికాదంటూ సలహాలిస్తున్నారు. దీంతో జనసేన టిడిపి మధ్య వైరం మరోసారి ముదిరి పాకాన పడింది.

తీరం..అతలాకుతలం..కనిపించని నేతలు

ఉప్పాడ తీరం అలల ఉధతికి ఇటీవల పెద్ద ఎత్తున అతలాకుతమయ్యింది. పదుల సంఖ్యలో నివాస గృహాలు సముద్రంలో మరోసారి కలిసిపోయాయి. రాకాసి అలలు తమ ఇళ్ళను నేలమట్టం చేశాయంటూ మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకునే వారే లేరా అంటూ రోధిస్తున్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న మంత్రి పవన్ కళ్యాణ్ తమను ఆదుకుంటారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగానే గడచిన ఎన్నికల్లో ఉప్పాడలో మత్స్యకారులంతా పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా నిలబడ్డారు. తాజాగా ఇళ్లన్నీ అలల తాకిడికి కొట్టుకుపోతుండగా మంత్రి పవన్ కళ్యాణ్ కనిపించడం లేదని విమర్శలు మత్స్యకారుల నుంచి వినిపిస్తున్నాయి. ఆయన తీరు మీద అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పిఠాపురంలో గెలిచిన ఎంఎల్ఎలు, ఎంపీలు కనీసం ముఖమైనా చూపించేవారని, ఏదో ఒక మాట అయినా చెప్పేవారని, ఈసారి పవన్ కళ్యాణ్ గానీ, జనసేన నాయకత్వం గానీ కనీసం తమను పలకరించడానికి కూడా తీరిక లేదా అని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కూడా తమను ఏనాడూ పరామర్శించిన సందర్భం లేదని మత్స్యకార నాయకులు వాపోయారు. ఇప్పటికైనా హామీలు, ప్రతిపాదనలకే పరిమితం కాక తీర రక్షణకు కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

వంతెన వద్ద చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్

రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

శివారు ప్రాంత రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. మండల శివారు ప్రాంతానికి వెళ్లే సాగునీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న ఇంజరం తాత్కాలిక తూముల వంతెన వద్ద జరుగుతున్న చెత్త తొలగింపు పనులను బుధవారం మంత్రి సుభాష్ పరిశీలించారు. కాలువ పైనుంచి వస్తున్న వ్యర్థాలతో వంతెనకు వేసిన ఐదు తూములలో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయి కేవలం రెండు తూములు మాత్రమే పని చేస్తున్న విషయాన్ని మంత్రి గుర్తించారు. దీనిపై జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట తాళ్లరేవు డిసి ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు, కోటిపల్లి డిసి ఛైర్మన్ దాట్ల విజయగోపాల రాజు ఉన్నారు.

గ్రామాల విలీనంపై మంత్రి పవన్ స్పందించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాష్ట్రంలో వివిధ కారణాలతో ఎన్నికలు జరగని, కొన్ని ఉప ఎన్నికల స్థానాలకు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో కాకినాడ విలీన గ్రామాలైన తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, రమణయ్యపేట, వాకలపూడి గ్రామాల భవితవ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, సంబంధిత శాఖ మంత్రి, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రకటన చేయాలని సిపిఎం కాకినాడ రూరల్ కమిటీ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ పంచాయతీలకు 14 ఏళ్లుగా కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం, లేదా పంచాయతీ ఎన్నికలు జరగకపోవడం వల్ల పరిపాలన అగమ్యగోచరంగా తయారయ్యిందని, దీంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయని తెలిపారు. ఈ పంచాయతీల్లో ఏ అభివృద్ధి జరగడం లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏ శాఖకూ చెందని గ్రామాలుగా ఉండటంతో నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారితో పాలన ఎన్నాళ్లు సాగిస్తారో, ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో, ఎలా నిర్వహిస్తారో పవన్ కళ్యాణ్ ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం తప్పనిసరిగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘిస్తూ 14 ఏళ్లుగా ఎన్నికలు జరుపకుండా ఉంచడం సరైంది కాదన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని టిడిపి ప్రభుత్వం కాకినాడ రూరల్ మండలంలో తొమ్మిది గ్రామాలను కాకినాడ నగరంలో విలీనం చేస్తూ అధికారిక నిర్ణయం తీసుకున్నట్లు గుర్తు చేశారు. ఈ గ్రామాల్లో ఈ కాలమంతా అవినీతి రాజ్యమేలిందని, నేటికీ అదే కొనసాగిస్తారా లేదా నగరంలో విలీనం చేసి అభివృద్ధి చేస్తూ విలీన గ్రామాల ప్రజల సమస్యలు తీరుస్తారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి

ప్రజాశక్తి -కరప

ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహించాలని రైతులకు పలువురు సూచించారు. బుధవారం వేములవాడలో ఉద్యాన శాఖ, సర్వే సాయి ఎడిబిల్ ఆయిల్స్ కంపెనీ ఆధ్వర్యంలో యార్లగడ్డ భూపాల్ ప్రసాద్ నూతనంగా సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలో విస్తరణ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీ అందిస్తోందని, తెలిపారు. సర్వే సాయి జిఎం ప్రభాకర్ రావు, జి.వరప్రసాద్, ఎడిఎ బాబూరావు, ఎఒ సత్య, రాజశేఖర్, వేములవాడ సర్పంచ్ మంగాదేవి, దూడల నారాయుడు, కూరాడ వెలుగుబంట్ల సూరిబాబు, కరప భవానీ ప్రసాద్, మామిడాల వెంకటేష్, బండారు మురళి, భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, మీసాల రాంబాబు, పబ్బినీడు వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పామాయిల్ మొక్క నాటుతున్న ఎంఎల్ఎ నానాజీ

నేడు భాస్కరరావు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - జగ్గంపేట

సూర్య భాస్కరరావు

తమ సొంత గ్రామంలో లైబ్రేరియన్‌గా చేరిన మేడవరపు సూర్య భాస్కరరావు పంచాయితీ విస్తరణాధికారి (డిప్యూటీ ఎంపిడిఒ) స్థాయి వరకూ ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించారు. ఆయన గురువారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. సూర్య భాస్కరరావు 1981లో బిక్కవోలు మండలం పందలపాకలో లైబ్రేరియన్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్‌గా రామచంద్రపురం మండలం కాపవరంలో ప్రమోషన్‌పై చేరారు. 2002లో సామర్లకోట మండలం గొంచాల పంచాయితీలో గ్రేడ్-3 కార్యదర్శిగా ప్రమోషన్‌పై మూడేళ్ల పని చేసి, 2005లో గ్రేడ్-2 కార్యదర్శిగా మండపేట మండలం ఏడిద గ్రామానికి బదిలీ అయ్యారు. 2020లో డిప్యూటీ ఎంపిడిఒగా కాకినాడ రూరల్ మండలంలో పనిచేశారు. 2024లో జగ్గంపేటకు వచ్చారు. ఇక్కడ 9 నెలల పని చేసి గురువారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

ముద్రగడ కోసం పూజలు

గొల్లప్రోలు : మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని స్థానిక గీతా మందిరంలో వైసిపి నాయకులు మొగలి అయ్యారావు కౌన్సిలర్ భావిశెట్టి జ్ఞానేశ్వరి చెక్కపల్లి దివానం పూజలు చేశారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ అలేఖ్య, కౌన్సిలర్ మొగలి దొరబాబు, ఒడిసెల సత్తిబాబు, గొల్లపల్లి శ్రీను, మొగలి అప్పారావు, మైనం రాజా, ఇరుగుల రమేష్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేడు కోట కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

మూడు నెలల అనంతరం ఇన్‌ఛార్జి మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరగనుంది. ఈ సమావేశం వైపు పట్టణ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూపులు చూస్తున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ విదేశీ పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో, ఆమె స్థానంలో సునేత్ర దేవికి ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు లేఖ అందింది. ఈ నేపథ్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పట్టణ అభివద్ధిని దష్టిలో ఉంచుకొని మొత్తం 50 అంశాలతో కూడిన భారీ ఎజెండాను సిద్ధం చేశారు. వైసిపి కౌన్సిలర్ల వ్యతిరేకతతో వాయిదా పడ్డ అంశాలపై ఈసారి అంగీకారం లభిస్తుందా లేదా అన్న సందేహాలు ఉన్నప్పటికీ సమావేశం పట్ల కౌన్సిలర్లు, పట్టణ ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

సాగులో మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

రైతులు సాగులో మెలకువలను పాటించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్ సూచించారు. రామవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఎడిఎ మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు నారు వేసుకోని రైతులు వెదజల్లుకోవాలని సూచించారు. ఎఒ ఎస్.నరసింహం, ఎ.శ్రీవల్లి పాల్గొన్నారు.

కోటనందూరు కెవి.మల్లవరం, అల్లిపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారి కెజె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ జగ్గఅప్పారావు, సురేష్, విఎఒ సుధీర్, రాజేష్ పాల్గొన్నారు.


సర్వేపై అవగాహన కలిగిస్తున్న రిసోర్స్‌పర్సన్ శ్రీనివాస్

స్వమిత్వ యోజనపై శిక్షణ

ప్రజాశక్తి-గొల్లప్రోలు, తాళ్లరేవు

గ్రామీణ ప్రజలకు సాధికారత కల్పించడం, వివాదం, పరిష్కారంతోపాటు మెరుగైన ప్రణాళికను అందించడమే స్వమిత్వ యోజన పథకం ముఖ్య ఉద్దేశమని రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ వర్మ తెలిపారు. బుధవారం గొల్లప్రోలు మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, విఆర్‌ఒలకు స్వమిత్వ యోజన పథకంపై ఆయన శిక్షణ ఇచ్చారు.

తాళ్లరేవు ఎంపిడిఒ సత్యనారాయణ అధ్యక్షతన అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వం ప్రజల భూ ఆస్తి సరిహద్దులను కొలతలు వేసి ఖచ్చితత్వంగా వారికి అందించడానికి చేపడుతున్న స్వమిత్వ సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరిగినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ ప్రకాష్, మండలంలోని ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి కాలువ పనులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-తాళ్లరేవు

స్థానిక జల వనరుల శాఖ కార్యాలయం వద్ద బుధవారం నీలపల్లి నీటి యాజమాన్య సంఘం అధ్యక్షులు ధూళిపూడి గోపి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సంఘం పరిధిలోని పనులకు చేసిన ప్రతిపాదనలను ఆయన వివరించారు. ఇరిగేషన్ కార్యాలయం వద్ద నార్త్ ఛానల్ నుంచి పత్తిగొంది పెద కాలువ వరకు కాలువ గట్టుపై గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. సుంకటరేవు వద్ద వాల్ నిర్మాణం చేయాలని, పత్తిగొంది పెద్దగున్నం వద్ద కల్వర్టు నిర్మాణం చేయాలని, పత్తిగొంది పంట కాలవకు సైడ్ వాల్ నిర్మాణం చేయాలని సమావేశంలో తీర్మానించారు. నీటి సంఘం పరిధిలోని మురుగునీటి కాలువల్లో తూడు తొలగించడానికి చర్యలు తీసుకుంటామని గోపి తెలిపారు. ఈ సమావేశంలో నీటి సంఘం ఉపాధ్యక్షులు కాలా సత్తిబాబు, పి.మల్లవరం నీటి సంఘం అధ్యక్షులు మొగలతుర్తి శ్రీనివాస్, డైరక్టర్లు ఉంద్రు కనకయ్య, పోశంశెట్టి లోవరాజు, గాలిదేవర వెంకటరమణ, జిత్తుగ వెంకటరమణ, రాయుడు కృష్ణ, పేర్ని శ్రీనివాసరావు, డి.లోవరాజు, కెవివి సుబ్బారావు, సిహెచ్.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోపి

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ప్రజాశక్తి -కాకినాడ రూరల్, సామర్లకోట

బాలికలు లేదా మహిళలను మభ్యపెట్టడం, బెదిరించడం లేదా ప్రలోభాలకు గురి చేస్తుంటే ఆ వ్యక్తుల సమాచారాన్ని వెంటనే దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియజేయాలని న్యాయవాది రవి శంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాజా పాల్గొన్నారు.

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వే పోలీస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్ఐ వి.ప్రసాద్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు, చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జంగం సంతోషి కుమారి, క్రాఫ్ కో ఆర్డినేటర్ బి.కుమారి, రైల్వే స్టేషన్ మాస్టర్ ఎం.రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికార బృందం

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దాపురం-జగ్గంపేట రహదారిలో ఉన్న ఎన్‌టిఆర్ కాలనీలో కొన్ని రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కాక కాలనీవాసులంతా అవస్థలు పడుతున్నామని ఆ కాలనీ మహిళలు మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కాలనీ అంతా మంచినీటి సరఫరా నిలిచిపోవటంతో మూడు రోజులుగా మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీరు సరిపోక ఎన్నో అవస్థలు పడుతున్నామన్నారు. తక్షణమే కాలనీలో మంచి నీటి బోరు నిర్మించి ఈ మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు.

నవోదయ దరఖాస్తులకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీ ఆగస్టు 13వ తేదీ వరకూ పొడిగించినట్టు నవోదయ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ జెఎన్‌విఎస్‌టి-2026 పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. 13-12- 2025న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి- పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్బుక్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి వివిధ వైద్య పరీక్షల నిమిత్తం, వైద్య సేవల నిమిత్తం వచ్చిన గర్భిణులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేస్బుక్ అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ పిల్లా పెదకాపు, వెంకటలక్ష్మి దంపతుల సహకారంతో ఈ అన్నదానం నిర్వహించామన్నారు. 150 మంది గర్భిణులకు 15 రకాల పౌష్టికాహార వంటకాలతో భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లా వెంకటలక్ష్మి, యమున, సత్య ప్రశాంత్, నవీన్ నాని, వడ్డి సత్యనారాయణ, ఆనంద్, లక్ష్మి, నాగలక్ష్మి, జి.ఉమా శేఖర్, సత్యరాణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, కౌన్సిల్ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. నగర పంచాయతీ పరిధిలో తాగునీరు, పారిశుధ్యం వీధిలైట్లు వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ సమావేశంలోనైనా ఈ సమస్యలపై అధికారులు ప్రజాప్రతినిధులు దష్టి సారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబాన్ని దత్తత తీసుకున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి -పెద్దాపురం

పి.4 బంగారు కుటుంబంలో భాగంగా బుధవారం పెద్దాపురం ఆర్‌డిఒ శ్రీరమణి ఒక కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. బుధవారం ఆమె పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామానికి వెళ్లి దత్తత తీసుకున్న మామిడి చక్రం కుటుంబాన్ని కలిసి వారి కుటుంబ అవసరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దాపురం అర్బన్‌లో ఒకటి, రూరల్‌లో రెండు కుటుంబాలను తాను దత్తత తీసుకున్నట్లు తెలిపారు.

హాకీ క్రీడాకారులకు ఆహ్వానం

ప్రజాశక్తి - సామర్లకోట

ఆగస్టు ఒకటి నుంచి 12వ తేదీ వరకు కాకినాడ స్టేడియంలో జరగనున్న హాకీ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు సామర్లకోటలో రెవెన్యూ అధికారులు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రానికి వసతి నిమిత్తం విచ్చేసిన మిజోరాం రాష్ట్రానికి చెందిన క్రీడాకారులకు తహశీల్దారు కె.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారుల నుదుటన కుంకుమ దిద్ది స్వాగతం పలికారు. పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులకు సామర్లకోటలో టిటిడిసి, విస్తరణ శిక్షణ కేంద్రాల్లో వసతి సదుపాయాలు ఏర్పాటు చేసినట్టు తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు.


డ్రోన్‌ను రైతులకు అందిస్తున్న ఎంఎల్ఎ నెహ్రూ

ఆధునిక యంత్రాలతో సేద్యం లాభసాటి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఆధునిక యంత్రాలతో సేద్యాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై డ్రోన్లు అందిస్తోందని ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తెలిపారు. బుధవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మల్లేపల్లికి చెందిన శ్రీరామ కిసాన్ డ్రోన్ సిహెచ్‌సి రైతు గ్రూపునకు డ్రోన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసేందుకు ఈ యంత్రాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి శ్రీనివాస్, రెడ్ల శ్రీరామ్, లక్ష్మణరావు, కొత్త వెంకటేశ్వరరావు, పోతుల మోహనరావు, కాటేపల్లి భద్రరావు, కొల్లు త్రిమూర్తులు, మురళీ రాజు, బద్ది సురేష్, డి.పార్వతి, కో కన్వీనర్ వి.సుహాసిని, డి.రత్నభద్రం, కె.భద్రరావు, డి.భద్రరావు, డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భార్యను చంపిన భర్త అరెస్టు

ప్రజాశక్తి - రాజానగరం

భార్యను అతికిరాతకంగా హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డిఎస్‌పి వై.శ్రీకాంత్ వెల్లడించారు. నర్సీపట్నం మండలం గిడుగూరుకు చెందిన వేమగిరి మాణిక్యానికి కొంతమూరుకు చెందిన ఉషారాణికి పదేళ్ల క్రితం వివాహం అయింది. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు నిహాంక్, ఏడేళ్ల కుమార్తె నిస్సీ ఉన్నారు. కొంతమూరులో ఆమె తల్లి నల్లమాటి లక్ష్మి నివాసం ఉంటున్న ప్రక్క వీధిలో వీరు జీవిస్తున్నారు. ఇద్దరి మధ్య కొన్ని రోజులకు మనస్పర్థలు వచ్చి తరచూ గొడవలు పడుతున్నారు. దీంత నెలరోజుల క్రితం పోలీసు స్టేషన్‌లో భర్త మాణిక్యంపై భార్య ఉషారాణి ఫిర్యాదు చేసింది. అప్పటి నుండి భర్త ఇంటికి రాకుండా బయట తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ రాత్రి మాణిక్యం ఇంటికి వచ్చి ఉషారాణితో గొడవ పడి నాపరాయితో ముఖంపై బలంగా కొట్టడంతో భయపడిన వారి పిల్లలు పక్క వీధిలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి పరుగులు తీశారు. అమ్మమ్మకు జరిగిన విషయం చెప్పడంతో ఆమె సంఘటనా ప్రాంతానికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న కుమార్తెను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించింది. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి ఆరోగ్యం విషమించి మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే అప్పటి నుంచి పరారీలో ఉన్న మాణిక్యంను బుధవారం కొంతమూరు బ్రిడ్జి వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు డిఎస్‌పి తెలిపారు. కేవలం రెండు రోజుల్లో నిందితుడుని అరెస్టు చేసిన సిఐ ప్రసన్నవీరయ్యగౌడ్, ఎస్ఐ కెవి.నాగార్జున, హెడ్ కానిస్టేబుల్స్ సురేష్‌బాబు, రాంప్రసాద్, కానిస్టేబుల్ అశోక్‌లను ఆయన అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. రాజమహేంద్రవరం కోటిలింగాల పేటలో నివాసం ఉంటున్న బత్తుల చిట్టిరాజు(50) కోరుకొండ మండలం గుమ్మళ్ళదొడ్డిలో ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగానికి ప్రతి రోజు మోటారు సైకిల్‌పై వెళుతుంటాడు. ఇందులోభాగంగానే బుధవారం విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న అతనిని కొంతమూరు వద్ద టిప్పర్ లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం: ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నల్గొండ గ్రామ శివారులో 2.57 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ వెల్లడించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో బుధవారం నల్గొండ గ్రామ శివారు మామిడి తోట వద్ద నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను గుర్తించి విఆర్‌ఓ సమక్షంలో వారిని తనిఖీ చేసినట్లు చెప్పారు. వారి వద్ద ఐదు ప్యాకెట్లలో ఉన్న సుమారు 2.57 కేజీల గంజాయి, ఒక మోటార్ సైకిల్, రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందుతులంతా నల్లగొండ గ్రామానికి చెందిన చింతల గంగరాజు(29), బందారు అప్పన్నదొర(50), బొబ్బిల్లంక గ్రామానికి చెందిన పోలిన సాయిసతీష్ (19), రాజానగరం మండలం తొర్రేడు గ్రామానికి చెందిన తాటిపాక గణేష్(20), కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన నేరుమల్లి అఖిల్(21)గా గుర్తించినట్లు తెలిపారు. వీరు ఒడిస్సా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్స్‌గా చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ డి.రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుని మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చిన్నకొండేపూడిలో ఒక భవనానికి పెయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందకు పడి ఒక కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగవరం గ్రామానికి చెందిన అల్లం సత్యజ్ఞానకుమార్(46) చినకుండేపూడి గ్రామానికి చెందిన లేఖరి తిరుపతిరావు నూతన భవనానికి పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. బుధవారం ఉదయం యథావిధిగా పని ప్రదేశానికి చేరుకుని పెయింటింగ్ పని ప్రారంభించాడు. పని చేసే క్రమంలో ఆ కార్మికుడు భవనం పై నుంచి కిందకు పడిపోయాడు. ఇంటి యజమాని ఉదయం ఏడు గంటలకు కుటుంబ సభ్యులకు తెలియచేయగా, వారు సంఘటనా ప్రాంతానికి చేరుకుని రఘుదేవపురంలో ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆ కార్మికుడు మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. మృతుడు భార్య అల్లం దేవిభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంకుమార్ వెల్లడించారు. పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించారు.

దాడి కేసులో జైలు శిక్ష

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్‌లో 2024 సంవత్సరంలో జరిగిన దాడి కేసులో ముద్దాయికి న్యాయమూర్తి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం..మాధవరాయుడుపాలెం చైతన్య నగరకు చెందిన ముద్దాయి ముంజేటి సురేష్ మద్యం మత్తులో డ్రింక్ సీసాతో అదే గ్రామానికి చెందిన బొల్ల ధనుంజయపై దాడి చేశాడు. గాయపడ్డ ధనుంజయ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ టి.కృష్ణసాయి కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి రాజమహేంద్రవరం 8 వ అదనపు జిల్లా కోర్టులో వాదోపవాదాలు జరగగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వై. బెన్నయ్యనాయుడు ముద్దాయికి 7 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేలను జరిమానా విధించినట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని భీమ క్రోసు పాలెం లో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలిన ఒకరికి తీవ్ర గయాలు అయ్యాయి.. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు అనిశెట్టి సుబ్బలక్ష్మి అనే మహిళ ఇంటిలో జరిగిన ఈ ప్రమాదంలో ఇంటిలోని వారు సురక్షితంగానే ఉండగా.. సాయం చేయడానికి వెళ్లిన పితాని చిన్నబాబుకు గాయాలపాలయ్యారు.. ఆయనను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. సిలిండర్ పేలుడు దాటికి భవనం దెబ్బతింది.

బైక్‌పై వచ్చి సెల్ ఫోన్ చోరీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నడిచి వెళ్తున్న వ్యక్తి నుంచి బుధవారం సెల్‌ఫోన్ లాక్కుని ఇద్దరు యువకులు బైక్‌పై పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర పంచాయతి పరిధిలోని కొండాలమ్మ చింత బైపాస్ రోడ్డు పై కాకినాడకు చెందిన కాట్నం వెంకటేశ్వర రావు నడిచి వెళుతున్నాడు. ఈ సమయంలో ఇద్దరు యువకులు మోటార్ బైక్ పై వచ్చి పడిపోయినట్లు నటించారు. వారిని లేపేందుకు వారి దగ్గరికి వెళ్లగా,వారు ఆయన జేబులోని సెల్ ఫోన్ లాక్కుని పరారయ్యారు. భాదితుడి పిర్యాదు మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-గండేపల్లి

అదృశ్యమైన మహిళ ఆచూకీని పోలీసులు కనిపెట్టి కేసును ఛేదించారు. మండలంలోని సింగరంపాలెంకు చెందిన వివాహిత ఈ నెల 18 నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివ నాగబాబు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వివాహితను హైదరాబాద్‌లో గుర్తించారు. అతి తక్కువ సమయంలో మహిళ ఆచూకీ కనిపెట్టిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు

చెరువులో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేట తాగునీటి చెరువులో ఒక వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చెరువులో మృతదేహం తేలుతూ కనిపించడంతో పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి స్థానిక టవర్ కాలనీకి చెందిన ఎల్లె డేవిడ్ రాజు (50)గా గుర్తించారు. రాజు పంచాయితీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్నాళ్ల కిందట జరిగిన బంగారు నగలు చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి 63 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్టు అన్నవరం పోలీసులు తెలిపారు. కెఎల్.పురానికి చెందిన గడ్డం రామ్ నవీన్, నర్సీపట్నంకు చెందిన అలెక్స్‌లను అరెస్ట్ చేశామని ఎస్ఐ హరిబాబు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

కాకినాడలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా శుక్రవారం యానాం అంతట విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ముగ్గళ్ల వీర వెంకట సత్యనారాయణ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీన శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

గురుకుల పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పెద్దాపురం లలిత ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సహాయంతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం ప్రారంభించారు. కళాశాలలోని కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లలిత ఎంటర్‌ప్రైజెస్ అధినేతలు మట్టే సత్య ప్రసాద్, మట్టే శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదిశంకర్, టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి, వైస్ ప్రిన్సిపల్ విజయ క్లారిస్ కుమారి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ కరపత్రం విడుదల

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రత్తిపాడు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమాల వేగుచుక్క సిఐటియు స్వాతంత్ర ఉద్యమ కాలం నుంచి పుట్టిన కార్మిక వర్గ ఆశయ సాధనతో పని చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్లో పారిశ్రామిక ప్రధాన కేంద్రమైన విశాఖ పట్టణంలో మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నిట్ల శ్రీను, అల్లాడి లక్ష్మి, సిహెచ్.వరలక్ష్మి, లోవ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పిఠాపురం

మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 12 మంది లబ్ధిదారులకు రూ.6,85,027 సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్టు జనసేన పార్టీ నియోజవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వెల్దుర్తి, ఎఫ్‌కె.పాలెం, జల్లూరు, మల్లాం, విరవ, నర్సింగాపురం, భోగాపురం, రాపర్తి, రాయవరం, గ్రామాలలో లబ్ధిదారులకు చెక్కులను వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బి.ఎన్.రాజు, పిల్లా శివశంకర్, హరిబాబు, సురేష్,వీర మహిళలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి -కరప

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సునీత

సమాజంలో నేరాల పట్ల బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలని కరప ఎస్ఐ టి.సునీత అన్నారు. బుధవారం కరప హైస్కూల్లో హెచ్ఎం ఎన్.రాజరాజేశ్వరి అధ్యక్షతన పోక్సో, డ్రగ్స్, సైబర్, క్రైమ్, డిజిటల్ అరెస్ట్, బాల్యవివాహాలు తదితర వాటిపై బాలికలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఎస్ఐ మాట్లాడారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, చిన్న వయసులో వివాహాలు చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలోని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్ఎల్ఎ జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటలో సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేట పంచాయితీ పరిధిలో రూ.48.6 లక్షలతో నిర్మించిన సచివాలయం 3 కార్యాలయాన్ని బుధవారం ఎమ్ఎల్ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. అనంతరం సచివాలయం ఆవరణ వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, సర్పంచ్ బచ్చల నాగరత్నం, జగ్గంపేట సొసైటీ చైర్మన్ బుర్రి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ నండ్ల చిరంజీవి, టిడిపి నాయకులు ఎస్ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, సత్తి సదాశివరెడ్డి, పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు, సిడిపిఓ పూర్ణిమ, పంచాయతీరాజ్ డిఇ ఉమా శంకర్, ఎంపిడిఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులకు పరామర్శ

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో అస్వస్థతకు గురైన విద్యార్థులను జిల్లా జడ్జి బుధవారం విచారించారు. గత 17న పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు గాలి రాకపోవడంతో అస్వస్థతకు గురయ్యారు. 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అస్వస్థత గురైన విద్యార్థులను, పేరెంట్స్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రభుత్వ వైద్యులను అస్వస్థతకు కారణాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఆర్.స్వామి, హెచ్ఎం, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల వనరుల కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

స్థానిక ఎంఇఒ కార్యాలయాన్ని బుధవారం సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరరావు పరిశీలించారు. కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లకు సంబంధించిన బయోమెట్రిక్ వివరాలు విద్యార్థులకు ఇచ్చిన గ్రీన్ పాస్‌పోర్ట్ స్టేటస్‌ను పరిశీలించారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి జోగిరెడ్డి, ఎంఇఒ వెంకట శివప్రసాద్ పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎంపీ గీత పరామర్శ

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

అనారోగ్యంతో బాధ పడుతున్న వైసిపి నాయకులను కాకినాడ మాజీ ఎంపీ, వైసిపి పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీత బుధవారం పరామర్శించారు. ఎండపల్లికి చెందిన జ్యోతుల చంటబ్బాయి, ఉప్పాడ గ్రామానికి చెందిన సూరాడ కుమార్, నక్క సతీష్‌ను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ మాజీ వైస్ సర్పంచ్ ఉలవల ఓంనమశ్శివాయ తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యుల పరామర్శించారు. అనంతరం పలు గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట వైసిపి మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కారే శ్రీనివాస్, రావు చిన్నారావు, జ్యోతుల చక్రబ్బాయి, మెరుగు ఎల్లాజీ, సర్పంచ్ పాలని దొరబాబు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ మీట్‌కు 3న క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆగస్టు 9 నుండి 11వ తేదీ వరకూ బాపట్లలో నిర్వహించే సౌత్ జోన్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆగస్టు 3న స్థానిక మహారాణి కళాశాలలో నిర్వహిస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టివిఎస్.రంగారావు, కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్‌వివిజి.వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, అండర్-16, అండర్-18, అండర్-20 విభాగాలలో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్‌త్రో, జావలిన్ త్రో తదితర అంశాలలో క్రీడాకారుల ఎంపిక చేస్తారన్నారు.

సత్యదేవునికి రూ.1.57 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి హుండీల లెక్కింపు ద్వారా రూ.1.57 కోట్ల ఆదాయం లభించింది. బుధవారం కొండపైన ఇఒ వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవి.రోహిత్ సమక్షంలో అధికారులు 35 రోజుల్లో వివిధ హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటు 35 గ్రాముల బంగారం, 659 గ్రాములు వెండి ఇంకా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించినట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు
శంకవరం న్యూస్ వన్ ఫోటో

కథా సాహిత్యంలో ధృవతార రావిశాస్త్రి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తెలుగు కథా సాహిత్యంలో ఒక ప్రభంజనం సృష్టించి అందరినీ ఆలోచింపజేసిన అభ్యుదయ కవి రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. రమణయ్య పేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రావిశాస్త్రి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో నిత్యం పై తరగతి వారి అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురై చిత్రహింసలు పడుతున్న దీన, హీన ప్రజల తరపున తన ప్రతి రచనలోనూ వకల్తా పుచ్చుకుని వాదించిన కవి రావిశాస్త్రి అన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఇందుగల ప్రసాద్ నాయుడు, ఎస్.శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఉద్యోగుల సౌజన్యంతో ఉత్తమ విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఐ.ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన రాష్ట్రంగా దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. నేటి విద్యార్థులు చక్కటి విద్యను అభ్యసించడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, డాక్టర్ శిరీష, ఎస్.శ్రీనగేష్, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్' ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్స్ విజయవంతంగా ముగిసింది. రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ ఆర్‌విఎస్.లలిత వ్యవహరించారు. ఈ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు క్వాంటమ్ కంప్యూటింగ్‌లోని ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎ.రమేష్ పాల్గొన్నారు..

పథకాలను పారదర్శకంగా అమలుచేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని సమగ్ర శిక్షా జిల్లా కో ఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. అనాతవరం, నగర పంచాయతీ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరో తరగతి, పదో తరగతి విద్యార్థుల నోటు పుస్తకాలను, విద్యా మిత్ర కిట్లను పరిశీలించారు. ఆనంతరం పాఠశాలల్లో జరుగుతున్న పిఎం శ్రీ పనులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సిఎంఓ కె.సుబ్రమణ్యం, ఎంఇఓ ఆర్.ఉదయ భాస్కర్ లతో పాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, కొవ్వూరు

ఉండ్రాజవరం మండ లంలోని ఉండ్రాజవరం, దమ్మెన్ను గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు, ఉద్యాన శాఖాధికారి డి.సుధీర్ రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా వస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. సాంప్రదాయ పద్ధతిలో సేంద్రీయ ఎరువులను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మండలంలో హరికరేవుల, కుమారదేవం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాసరావు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. పకృతి వైపరిత్యాల వల్ల నష్టకలిగితే ఆర్థిక సహాయం పొందడానికి పిఎం ఫసల్ బీమాలో చేరాలన్నారు.

ప్రసాదం తయారీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం లడ్డూ తయారీని, అన్న ప్రసాదం తయారీ, పులిహోర ప్రసాదాల తయారీ, ఆర్వో వాటర్ ప్లాంట్ తదితర కేంద్రాలను ఉభయ గోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జిఎబి నందాజీ, జిల్లా ఫుడ్స్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై.రామయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా. ప్రసాదాల తయారీ కేంద్రాన్ని, అన్న ప్రసాదం కేంద్రాలను సందర్శించారు. అనంతరం ప్రసాదాల తయారీ పట్ల, అక్కడ ఉన్న సౌకర్యాల పట్ల పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మండలంలోని ర్యాలి గ్రామంలో వెలసిన స్వయంభు పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వార్ల ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించేందుకు హైదరాబాదుకు చెందిన విష్ణుభట్ల నాగ కృష్ణ శ్రీనివాస్ ఉదయభారతి దంపతులు బుధవారం రూ.10,116 ఆలయ కార్య నిర్వహణ అధికారి భాగవతుల వెంకట రమణమూర్తికి అందజేశారు వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు.

నేడు సాయికృష్ణ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం సబార్డినేట్‌గా పనిచేస్తున్న గుత్తుల సాయికృష్ణ నేడు ఉద్యోగ విరమణ చేయనున్నారు. మూడు దశాబ్దాల పాటు ఆయన వివిధ ప్రభుత్వం కార్యాలయాల్లో పనిచేశారు. 1984లో తొలుత పి.గన్నవరంలో ఆయన అటెండర్‌గా విధుల్లో చేరారు. 1991 నుంచి 2020 వరకూ అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో, 2020లో కొత్తపేట పంచాయతీ రాజ్ సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.. అనంతరం 2021లో తిరిగి అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో సబ్ ఆర్డి నేటర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన సేవలందించారు. నిబద్ధతగా పని చేసి పలువురి అధికారులు మన్ననలు పొందారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు.

గుత్తుల సాయికృష్ణ

హైస్కూల్లో సౌకర్యాలు కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి - జగ్గంపేట

రాజపూడి జెడ్‌పి హైస్కూల్లో సౌకర్యాలు కల్పించాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కనీసం తాగునీరు కూడా లేదన్నారు. 600 విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, డాన్ శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం, కె.ఏనుగుపల్లి కి చెందిన గాధ సురేష్, తండ్రి: పెద్దిరాజు, డోర్ నెం. 2-183 లో నివాసముంటున్నాను. ది. 20-07-2025 తేదిన నేను పాస్‌పోర్టు నెం. **U 1847474** ను జిరాక్స్ తీయించుకొనేందుకు ఏనుగుపల్లి నుండి పి.గన్నవరం వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయినది. దయచేసి నా పాస్‌పోర్టు దొరికినవారు ఈ క్రింది అడ్రస్సుకు పంప కోరుచున్నాను.

గాధా సురేష్, తండ్రి: పెద్దిరాజు
డోర్ నెం.2-183, కె.ఏనుగుపల్లి,
పి.గన్నవరం మండలం
సెల్.8885915552

లింకు దస్తావేజు పోయినది

శ్రీమతి కుందుం సత్యవతి, W/o. కుందుం కరుణాకర్, డోర్ నెం. 46-5-12 రు, ఉప్పు వీధి, జాంపేట, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **ఒరిజినల్ లింక్ క్రయ దస్తావేజు నెం. 516/1973, Dt. 24-04-1973** రాజమండ్రి సబ్‌రిజిస్ట్రారు ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన దస్తావేజు **ది. 26-7-2025 వ తేదీన** జాంపేట రాజమండ్రి నందు నా ఇంటి డోరు నెం. 46-5-12 నుండి ప్రకాష్‌నగర్ నందు జిరాక్స్ నిమిత్తం వెళ్లుచుండగా రాజమండ్రి ప్రకాష్‌నగర్ రౌండ్ పార్క్ వద్ద పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

కుందుం సత్యవతి
సెల్: 9666091227

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం, మూలస్థానం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి మాచరరావు, S/o. వీర వెంకట సత్యనారాయణ అను నేను 10-07-2025వ తేదీన నా పాస్‌పోర్టును నెంబరు **Y3423246** ను తీసుకుని ఆలమూరు బైక్‌పై జిరాక్స్ కోసం వెళుతున్న సమయంలో నా పాస్‌పోర్టు ఒరిజినల్ మార్గం మధ్యలో పడిపోయినది. నా పాస్‌పోర్టు కొరకు చుట్టుప్రక్కల అంతా వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల క్రింది అడ్రసుకు ఇవ్వగలరు.

పెద్దిరెడ్డి మాచరరావు,
S/o. వీర వెంకట సత్యనారాయణ
మూలస్థానం గ్రామం, ఆలమూరు మండలం
సెల్: 9381582022

ప్రకటన

కీ॥శే॥ మల్లాడి ధనరాజు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎన్.కొత్తపల్లి, పెద రాఘవులపేట గ్రామం, డో.నెం. 7-78 కాపురస్తులు మల్లాడి నాగరాజు, S/o. ధనరాజు (లేటు), S/o. కన్నయ్య (లేటు) గారి కుమారుడు మల్లాడి నాగరాజు ఇచ్చిన పత్రికా ప్రకటన.

నా తండ్రి **మల్లాడి ధనరాజు గారు** ఎన్.కొత్తపల్లి పెద రాఘవులుపేట గ్రామంలో మా ఇంటి వద్ద 10-11-2003 సం॥రంలో మరణించారు. వీరి మరణం ఎన్.కొత్తపల్లి గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: మల్లాడి నాగరాజు
S/o. మల్లాడి ధనరాజు (లేటు)
డో.నెం. 7-78, ఎన్.కొత్తపల్లి పెద రాఘవులపేట
ఉప్పలగుప్తం మండలం, సెల్: 9959484273

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE, KAKINADA
A.S.S.R. No.7982/2024

Between:
Shaik Hussain ...Appellant/ Defendant
And
Bugatha Rambabu (died) and others ...Respondents/ Plaintiffs

To:R2: Bugatha Vijaya, W/o. late Rambabu, Hosuewife, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.
R3: Bugatha Parvathi Lakshmi Vani, W/o. Panthadi Brahmanandam, Housewife, D.No. 18-15-4, Suryanarayanapuram, Kakinada.
R4: Bugatha Shiva Sankar, S/o. late Rambabu, Private Employee, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.
R5: Bugatha Udaya Bhaaskara Venkataramana, S/o. late Rambabu, Private Employee, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.

పై నెంబరు పిటిషన్‌లో 2 to 5 రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్య పూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది. **01-08-2025** తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం **10.30** ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

మేడపాటి రామారెడ్డి
అడ్వకేట్, డో.నెం.23-7-7/1, దుగ్గిరాలవారివీధి కాకినాడ, సెల్: 9059429999

వేలం ప్రకటన

మహారాజశ్రీ గౌరవనీయులైన రాజమహేంద్రవరం 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఈ.పి. నెం. 39/2022
ఓ.యస్.నెం. 406/2012

Between:
దేవలంక పార్వతి వగైరా ...డిక్రీ హోల్డర్స్
మరియు
దేవలంక బాలవీరకుమార్, (తండ్రి) (లేటు) సూర్యారావు, హిందువు, వయస్సు 44 సం॥లు, కేరాఫ్ డి.వి.సి. ఇంజనీరింగ్ కాలేజ్, పాలచర్ల, రాజానగరం మండలం, తూర్పుగోదావరి జిల్లా. ...జె.డి.ఆర్

పై నెంబరు డిక్రీ బాకీకి జడ్జిమెంట్ డెటార్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థి పై కోర్టు వారు సమక్షములో **ది.13-08-2025 తేదీన ఉదయం 10.30 గంటల** లగాయితు బహిరంగ వేలము జరుపబడును. ఆశక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చును. మిగతా వివరములకు డిక్రీ హెల్డరు గారి అడ్వకేటు ఆఫీసు నందు గాని, పై కోర్టు నజారతు ఆఫీసు నందు గాని తెలియజేయబడును.

__వేలం కాబడు షెడ్యూలు ఆస్తి వివరములు__

తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామం, నరేంద్రపురం గ్రామ పంచాయితీ

__ఐటమ్ నెం.1:__

తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామం, నరేంద్రపురం గ్రామ పంచాయితీ డోరు నెం.3-172 క్రొత్త డోరు నెం.3-147 యందు గల చ.గ. 376.27 లు యిందలి ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగు అందుకు హద్దులు:

తూర్పు: రోడ్డు, **దక్షిణం:** ఆదిమూలం వారి ఇల్లు. **పడమర:** యిందలి ఐటమ్ నెం.2, **ఉత్తరం:** గొల్లకోటి సూర్యకాంతం గారి ఇల్లు.

సదరు హద్దుల మధ్య గల చ.గ.376.27 లు లో అనిర్ధిష్టపు 1/4వ వంతు వాటాకు చెందిన ఖాళీ నివేశ్న స్థలము. అందు ఇల్లు మరియు మామూలు ఈజిమెంటు హక్కులతో సహా.

__యిటమ్ నెం. 2:__

తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామం, నరేంద్రపురం గ్రామ పంచాయితీ డోరు నెం. 3-172 క్రొత్త డోరు నెం. 3-147 యందు గల చ.గ. 123.72 లు యిందలి ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగు అందుకు హద్దులు:

తూర్పు: యిందలి ఐయిటమ్ నెం. 1, **దక్షిణం:** ఆదిమూలం వారి ఇల్లు, **పడమర:** దేవలంక వెంకట్రావు గారి భూమి. **ఉత్తరం:** గొల్లకోటి సూర్యకాంతం గారి ఇల్లు.

సదరు హద్దుల మధ్య గల చ.గ. 123.72 లు లో అనిర్ధిష్టపు 1/4వ వంతు వాటాకు చెందిన ఖాళీ నివేశ్న స్థలము. అందు ఇల్లు మరియు మామూలు ఈజిమెంటు హక్కులతో సహా.

డిక్రీ హోల్డరు విలువ: రూ.30,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ. 20,00,000/-
జె.డిఆర్. కిమ్మత్తు: ఇవ్వలేదు
మార్కెట్టు విలువ: రూ. 12,49,975/- లు నిర్ణయించడమైనది.

యం.ఆర్ సత్యసాయి (రాంబాబు)
అడ్వకేట్, డోర్ నెంబరు. 86-11-11/1, వాడ్రేవు నగర్, తిలక్ రోడ్డు, రాజమహేంద్రవరం, సెల్: 9848376941